క్లుప్తంగా

ఒలింపియాడ్‌లో సంపత్‌కు 7వ ర్యాంకు


సంపత్‌ను సత్కరిస్తున్న డీఈవో చంద్రకళ

సీతమ్మధార: గతేడాది నిర్వహించిన ఒలింపియాడ్‌ నేషనల్‌ లెవల్‌ టెస్ట్‌లో గురుద్వారాకు చెందిన విద్యార్థి సంపత్‌ ఉత్తమ ప్రతిభ చూపాడు. జాతీయ స్థాయిలో 17వ ర్యాంకు, ఉమ్మడి రాష్ట్రాల్లో 7వ ర్యాంకు సాధించాడు. పీ అండ్‌ టీ కాలనీలోని ఎస్‌ఎంసీహెచ్‌ స్కూల్‌లో 7వ తరగతి చదువుతున్నాడు. సెమ్స్‌ ఒలింపియాడ్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో విజయనగరంలోని గురజాడ పబ్లిక్‌ స్కూల్‌లో విద్యార్థికి ఈ అవార్డును అందించారు. ఈ సందర్భంగా శనివారం సంపత్‌ను జిల్లా విద్యా శాఖాధికారి(డీఈవో) చంద్రకళ అభినందించి సత్కరించారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ ఉమ్మడి విశాఖ కన్వీనర్‌ గోపినాథ్‌, స్టేట్‌ వైస్‌ ప్రెసిడెంట్‌ రామారావు, స్కూల్‌ స్టాఫ్‌ హేన, కరుణాకర్‌ తదితరులు పాల్గొన్నారు.

శబరిమలకు స్వాముల పయనం


అయ్యప్ప దర్శనానికి బయలుదేరిన ఆళ్ల శివగణేష్‌, మాలధారులు

తాటిచెట్లపాలెం: శబరిమలలో వెలసిన అయ్యప్పస్వామి దర్శనార్థం వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్‌ మిత్ర బృందం శనివారం బయలుదేరింది. 40 రోజులుగా అయ్యప్ప మాలధారులైన ఈ బృందం నియమ నిబంధనతలో దీక్షను పూర్తిచేశారు. ఆదివారం శబరిమలలో అయ్యప్పను దర్శించుకుని దీక్షను విరమించుకుని విశాఖకు తిరుగు పయనమవుతారు.

అన్ని సీట్లూ గెలుస్తాం

సీతంపేట: విశాఖ ప్రజలు జనసేన వైపు చూస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో తమదే విజయమని ఆ పార్టీ పీఏసీ సభ్యుడు కోన తాతారావు ధీమా వ్యక్తం చేశారు. ద్వారకానగర్‌ పౌర గ్రంథాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీని ప్రజలకు మరింత చేరువ చేసేలా ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడిగా పంచకర్ల రమేష్‌బాబును నియమించారని తెలిపారు. టీడీపీ, జనసేన కలిసి విశాఖలో మొత్తం 15 అసెంబ్లీ సీట్లు గెలుస్తామన్నారు. రమేష్‌బాబు మాట్లాడుతూ గత అనుభవంతో పార్టీని బలోపేతం చేస్తానన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజలకు తాయిలాలతో ఓట్లు వేయించుకోవాలని చూస్తోందన్నారు. సమావేశంలో జనసేన నాయకులు రాజు, పీతల మూర్తి యాదవ్‌ పాల్గొన్నారు.

రోడ్డును ఆక్రమించి పనులు


గాంధీనగర్‌ రోడ్డులో అడ్డంగా భవన నిర్మాణ సామగ్రి

సీతమ్మధార: జీవీఎంసీ 24వ వార్డు గాంధీనగర్‌ ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయం ఎదురుగా రోడ్డును ఆక్రమించి ఓ యజమాని భవన నిర్మాణ పనులు చేయిస్తున్నాడు. రహదారిలో ఇసుక, పిక్క, కర్రలతోపాటు కాంక్రీట్‌ మిషన్‌ అడ్డంగా పెట్టి పనులు చేస్తుండటంతో పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

శక్తి స్వరూపిణి.. భాగ్య ప్రదాయిని


లలితా పీఠంలో దుర్గాదేవి అలంకరణలో లలితాదేవి


సీతంపేట పార్వతీశ్వరాలయంలో రాజరాజేశ్వరిగా పార్వతీదేవి


మురళీనగర్‌ సరస్వతీదేవి అలంకరణలో లలితాంబిక

విశేష అలంకరణల్లో దుర్గమ్మ దర్శనం

సీతంపేట: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు నియోజకవర్గంలోని అమ్మవారి ఆలయాలు, మండపాల్లో వైభవంగా జరుగుతున్నాయి. ఏడో రోజు శనివారం అక్కయ్యపాలెం లలితానగర్‌లోని లలితా పీఠంలో అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పీఠం దర్బార్‌ హాల్లో పండితుల వేద మంత్రాల మధ్య రాజశ్యామల హోమం, కాళీ హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం లలితా అమ్మవారికి విశేష అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం చండీ హోమాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు లలితాదేవిని దర్శించుకున్నారు. ఆదివారం మహిషాసుర మర్దిని అలంకరణలో లలితాదేవి దర్శనమిస్తారని, ఉదయం మహా సౌరం, అరుణ హోమాలు జరుగుతాయని పీఠం మేనేజర్‌ మన్నవ కృష్ణసేన్‌ తెలిపారు.

రాజరాజేశ్వరీదేవిగా పార్వతీదేవి

సీతంపేట పార్వతీశ్వరాలయంలోని అమ్మవారు శనివారం రాజరాజేశ్వరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు శివాజీ శర్మ, భాస్కరశర్మ పర్యవేక్షణలో లలితా సహస్రనామార్చన, ఖడ్గమాలార్చన, గాయత్రి నామార్చన, చండీ హోమం, అమ్మవారి శ్రీచక్ర మేరువులకు మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. సాయంత్రం మహిళలు సామూహికంగా లలితా పారాయణ పఠించారు. ఆదివారం దుర్గాదేవి అలంకరణలో దర్శనమిస్తారని అర్చకులు తెలిపారు.

సరస్వతీదేవిగా లలితాంబిక

మురళీనగర్‌: మురళీనగర్‌ లలితాంబిక ఆలయంలో శనివారం అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. కేసరి ప్రసాదం నైవేద్యంగా సమర్పించారు. అత్యధిక సంఖ్యలో మహిళలు అమ్మవారికి పూజలు చేశారు. షైనింగ్‌ స్టార్స్‌ అకాడమీ మాస్టర్‌ ప్రశాంతి ఆధ్వర్యంలో


లలితా పీఠంలో రాజశ్యామల హోమంలో పాల్గొన్న భక్తులు

విద్యార్థులు ప్రదర్శించిన శాస్త్రీయ నృత్యం అలరించింది. ఆలయ కార్యదర్శి సనపల వరప్రసాద్‌ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కరెన్సీ నోట్లతో జయదుర్గమ్మకు అలంకరణ

సీతంపేట: గురుద్వారా వద్ద గల జయదుర్గ ఆలయంలో నిర్వహిస్తున్న నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం కరెన్సీ నోట్లతో అమ్మవారిని అలంకరించారు. ప్రతి రోజూ అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమ పూజలు, హోమాలు నిర్వహిస్తున్నట్టు ఆలయ అర్చకుడు మురళి, ధర్మకర్తలు మాల్యాద్రి, మాధవి తెలిపారు.


గురుద్వారా వద్ద కరెన్సీ నోట్లతో అలంకరించిన దుర్గమ్మ గుడి

రాధాకృష్ణగా ప్రసన్న వేంకటేశ్వరుడు


రాధాకృష్ణ అలంకరణలో ప్రసన్న వేంకటేశ్వర స్వామి


అన్నపూర్ణేశ్వరీ అలంకరణలో దుర్గమ్మవారు

సీతమ్మధార: నార్త్‌ ఎక్స్‌టెన్షన్‌లోని మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వర, అయ్యప్ప, షిర్డీసాయిబాబా దేవాలయంలో దేవీ నవరాత్రులు, శ్రీవారి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం రాధాకృష్ణ అలంకరణలో ప్రసన్న వేంకటేశ్వర స్వామి, అన్నపూర్ణేశ్వరి అలంకరణలో మహాలక్ష్మి దుర్గమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 6 గంటలకు ఆలయంలో దుర్గా హోమం, అనంతరం అమ్మవారికి అభిషేకాలు చేశారు. ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో అర్చక బృందం ఉదయం ఆరు గంటలకు ప్రసన్న వేంకటేశ్వరుడికి ప్రత్యేక అభిషేకాలు జరిపారు. సాయంత్రం అమ్మవారికి కుంకుమ పూజలు చేశారు. రాత్రి ఏడు గంటలకు శ్రీవారి తిరువీధి ఉత్సవం వైభవంగా జరిగింది. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది వనజాక్షి, శివ, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

దసరా కానుక పంపిణీ

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 42వ వార్డు నాయకులు, కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, శానిటేషన్‌, విద్యుత్‌ సిబ్బందికి దసరా సందర్భంగా కార్పొరేటర్‌ ఆళ్ల లీలావతి, వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆళ్ల శ్రీనివాస్‌ స్వీట్స్‌ పంపిణీ చేశారు. తాటిచెట్లపాలెంలోని కార్పొరేటర్‌ నివాసంలో శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో కంచు రమణమూర్తి, శ్రీనివాస్‌రెడ్డి, నూకరాజు, వెంకటేష్‌, జగన్‌మోహన్‌, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.


స్వీట్‌ బాక్స్‌లు అందిస్తున్న ఆళ్ల లీలావతి, శ్రీనివాస్‌

వైభవ వేంకటేశ్వర స్వామికి సుప్రభాత సేవ

మురళీనగర్‌: కప్పరాడ ఎన్‌జీజీవోస్‌ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున గొల్లసన్నిధి సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిపారు. మధ్యాహ్నం 300 మంది భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం 5.30 గంటలకు ఆకాశ దీపారాధన, రాత్రి 7 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు స్వామికి సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో తరలివచ్చి వైభవుడిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బి.ప్రసాద్‌ ఏర్పాట్లు పర్యవేక్షించారు.


ఆలయ ప్రదక్షిణ చేస్తున్న భక్తులు

22 నుంచి ధర్మప్రచార వారోత్సవాలు

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన ఎరుకుమాంబ అమ్మవారి ఆలయ ఆవరణలో ఈనెల 22 నుంచి 28 వరకు ధర్మప్రచార వారోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో జి.వి.రమాబాయి తెలిపారు. 22 సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ఆధ్యాత్మికవేత్త ఎం.వి. రాజశేఖర్‌ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తారన్నారు. బ్రహ్మశ్రీ కలగా మురళీకృష్ణచే దేవీమహత్యంపై ప్రవచనం, 23 సాయంత్రం 6 గంటలకు రేడియో, టీవీ ఆర్టిస్ట్‌ యతిరాజు భాగవతార్‌ ఆధ్వర్యంలో హరికథా గానం, 24న సుధా సీతాపతిరావుచే హరేరామ సంకీర్తన, 25న సిరి డ్యాన్స్‌ అకాడమీ స్వర్ణ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన, 26న సాయిరాజు భక్తి రంజని బృందంచే భజనలు, 27న వెంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్‌ ప్రతినిధి కె.సునీత సారథ్యంలో కోలాటం, 28 ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు లలితా మాతృ మండలి మహిళా సభ్యులచే సామూహిక పారాయణ జరుగుతాయన్నారు.


ప్రత్యేక అలంకరణలో ఎరుకుమాంబ అమ్మవారు

రహదారి, డ్రైనేజీ పనుల పరిశీలన

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు నరసింహనగర్‌, గణేష్‌నగర్‌ ప్రాంతాల్లో జరుగుతున్న రహదారి, డ్రైనేజీ పనులను శనివారం డిప్యూటీ ఫ్లోర్‌ లీడర్‌, కార్పొరేటర్‌ కంపా హనోకు పరిశీలించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా త్వరితగతిన పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌, జీవీఎంసీ సిబ్బందికి ఆయన సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, వర్క్స్‌ ఇన్‌స్పెక్టర్‌ రవి, కాలనీ నాయకులు సత్యానందంరెడ్డి, గోవింద్‌, పార్టీ నాయకులు నేపాల్‌ శ్రీను, నాయుడు తదితరులు పాల్గొన్నారు.


గణేష్‌నగర్‌లో రహదారి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ కంపా హనోకు

కాగ్నిటివ్‌ డిజిటల్‌ థెరపీ కేంద్రం ప్రారంభం

ఏయూ క్యాంపస్‌: ఆంధ్ర విశ్వవిద్యాలయం సైకాలజీ విభాగంలో ఏర్పాటు చేసిన ఆధునిక కాగ్నిటివ్‌ డిజిటల్‌ థెరపీ కేంద్రాన్ని శనివారం ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి ప్రారంభించారు. అనంతరం కేంద్రం పనితీరును ప్రత్యక్షంగా పరిశీలించారు. కేంద్రం ప్రత్యేకతలు, ప్రజలు, విద్యార్థులకు ఉపయుక్తంగా నిలిచే విధానాలను అడిగి తెలుసుకున్నారు. తరువాత విద్యార్థులకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన విశ్రాంతి గదిని విద్యార్థినితో వీసీ ప్రారంభింపజేశారు. విభాగంలో ప్రయోగశాలలను తనిఖీ చేశారు. విభాగాధిపతి ఆచార్య ఎం.వి.ఆర్‌.రాజు మాట్లాడుతూ వ్యక్తిలో మానసిక సమస్యను గుర్తించడం, డిప్రెషన్‌, ఒత్తిడి స్థాయిలు, యాంగ్జయిటీ, ఎమోషన్స్‌ వంటివి కాగ్నిటివ్‌ డిజిటల్‌ థెరపీ సహాయంతో గుర్తించడం సాధ్యపడుతుందని చెప్పారు. ఆత్మహత్యల నివారణకు ఇది ఎంతగానో ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. ఆల్కహాల్‌ ఎవర్షన్‌ థెరపీ(మద్యం మాన్పించే విధానం), న్యూరో ఫిజిలాజికల్‌ లాబ్‌కు పని చేస్తున్న విధానాలు వివరించారు. కార్యక్రమంలో సైన్స్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ ఆచార్య కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినితో విశ్రాంతి గదిని ప్రారంభింపజేస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

విద్యార్థుల భాగస్వామ్యంతో స్వచ్ఛ క్యాంపస్‌

ఏయూ క్యాంపస్‌: విద్యార్థుల భాగస్వామ్యంతో స్వచ్ఛ క్యాంపస్‌ సాకారం అవుతుందని ఐఏఎస్‌ఈ ఆచార్యులు, విద్యా విభాగాధిపతి డాక్టర్‌ టి.షారోన్‌రాజు అన్నారు. శనివారం ఉదయం ఏయూ ఐఏఎస్‌ఈలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విభాగ పరిసరాలను విద్యార్థులు, ఆచార్యులు స్వయంగా శుభ్రం చేశారు. వర్సిటీని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దడం కోసం విద్యార్థులను భాగస్వాములను చేస్తూ నిరంతరం ఈ కార్యక్రమం చేపడతామని షారోన్‌రాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌ నాగరాజ కుమారి, డాక్టర్‌ బీఆర్‌ అంబేడ్కర్‌ ఓపెన్‌ యూనివర్సిటీ నుంచి డాక్టర్‌ అరవింద్‌ కుమార్‌, విభాగ అధ్యాపకులు, అంబేడ్కర్‌ సార్వత్రిక విశ్వవిద్యాలయం బీఈడీ విద్యార్థులు పాల్గొన్నారు.

వాడవాడలా అన్నసమారాధనలు


గణేష్‌నగర్‌లో భక్తులకు అన్నదానం చేస్తున్న కార్పొరేటర్‌ సారిపిల్లి గోవింద్‌


పట్టాభిరెడ్డి తోటలో అన్నదానం ప్రారంభిస్తున్న కార్పొరేటర్‌ అల్లు శంకరరావు


తారకరామానగర్‌లో అన్నదానం ప్రారంభిస్తున్న పైడి రమణ

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 45వ వార్డు తాటిచెట్లపాలెం జాతీయ రహదారి పక్కన గల గురునాథరావు కాలనీలో దుర్గాగణపతి యూత్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో దసరా మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. శనివారం తారకరామానగర్‌, రామచంద్రనగర్‌, గురునాథరావు కాలనీ వాసులకు భారీ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ ప్రారంభించి అన్నప్రసాదం వడ్డించారు. అసోసియేషన్‌ సభ్యులు బెహరా రమణ, వరహాలు, ఫణీంద్ర, సీర సత్యారావు, పార్టీ నాయకులు నేపాల్‌ శ్రీను, నాయుడు, దుర్గ, సన్నీ తదితరులు పాల్గొన్నారు.

గణేష్‌నగర్‌లో..

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు గణేష్‌నగర్‌లో మహిళా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దుర్గా శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం అన్నదానం నిర్వహించారు. ముఖ్య అతిథి కార్పొరేటర్‌ సారిపిల్లి గోవింద్‌ భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. ముందుగా దుర్గాదేవికి ఆయన పూజలు చేశారు. నిర్వాహకులు దుశ్శాలువాతో కార్పొరేటర్‌ను సత్కరించారు. కార్యక్రమంలో గణేష్‌నగర్‌ మహిళా కమిటీ సభ్యులు, స్థానిక నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్‌ కాలనీలో..

సీతమ్మధార: ద్వారకానగర్‌ 6వ లేన్‌, భగత్‌సింగ్‌ కాలనీలో సాయి విఘ్నేశ్వర సేవా సంఘం ఆధ్వర్యంలో భారీ అన్నసంతర్పణ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళా ఆస్పత్రి అధినేత డాక్టర్‌ పైడి వెంకటరమణమూర్తి ఆర్థిక సాయం చేశారు. ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని దుర్గమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదం వడ్డించారు. కార్యక్రమంలో వెంకటరెడ్డి, నిర్వాహకులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.


భగత్‌సింగ్‌ కాలనీలో అన్నప్రసాదం వడ్డిస్తున్న డాక్టర్‌ రమణమూర్తి

పట్టాభిరెడ్డి తోటలో..

మురళీనగర్‌: మురళీనగర్‌ సమీపంలోని పట్టాభిరెడ్డి తోటలో స్థానికులు అన్నసమారాధన నిర్వహించారు. జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్‌ లీడర్‌, 49వ వార్డు కార్పొరేటర్‌ అల్లు శంకరరావు దుర్గాదేవిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం అన్నదానాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు బి.శంకర్‌, ఎస్‌.శ్రీను, పి.చైతన్య, సీహెచ్‌ శ్రీను, కిషోర్‌ పాల్గొన్నారు.

రెండో సారి కో కన్వీనర్‌గా సత్యనరసింహరాజు



తాటిచెట్లపాలెం: బీజేపీ యువ మోర్చా రాష్ట్ర సోషల్‌ మీడియా కో కన్వీనర్‌గా రెండో సారి ఉత్తర నియోజకవర్గ నాయకుడు ఇందుకూరి సత్యనరసింహరాజు నియమితుడయ్యారు. పార్టీ రాష్ట్ర యువ మోర్చా అధ్యక్షుడు మిట్ట వంశీకృష్ణ నియామక ఉత్తర్వులను అందజేశారు. తనను రెండో సారి నియమించినందుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, మాజీ ఎమ్మెల్యే పి.విష్ణుకుమార్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్‌.మాధవ్‌లకు, రాష్ట్ర జనరల్‌ సెక్రటరీ సాగి కాశీవిశ్వనాథరాజు, జిల్లా అధ్యక్షుడు రవీంద్ర మేడపాటిలకు సత్యనరసింహరాజు ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా దుర్గమ్మ సారె ఊరేగింపు

సీతంపేట: శ్రీదుర్గా దంతేశ్వరి యూత్‌ ఆధ్వర్యంలో సీతంపేట గొల్ల వీధిలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం అమ్మవారికి సారె ఊరేగింపు నిర్వహించారు. ముఖ్య అతిథి సింహాచలం దేవస్థానం పాలక మండలి సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు అమ్మవారిని దర్శించి సారె ఊరేగింపును ప్రారంభించారు. భవానీ మాలధారులు, స్థానిక మహిళలు ఊరేగింపులో పాల్గొన్నారు. సుమారు 108 రకాల స్వీట్లు, పండ్లు, పువ్వులు, చీర, గాజులు, పసుపు, కుంకుమ అమ్మవారికి సమర్పించి మేళతాళాలతో సారె ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు బోర గోవింద్‌, బోర అప్పలరాజు, వియ్యపు సంతోష్‌, బి.దంతేష్‌, ఆదిత్య, కె.దంతేష్‌, పల్లా లోహిత్‌, దంతి రమేష్‌, గౌతం పాల్గొన్నారు.


సారె ఊరేగింపు ప్రారంభిస్తున్న సంపంగి శ్రీనివాసరావు


అందరికీ సమానంగా సంక్షేమ పథకాలు

సీతమ్మధార: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ సమానంగా అందుతున్నాయని విశాఖ సిటీ రిక్షా కార్మిక సంఘం ప్రెసిడెంట్‌ బొడ్డేటి శంకరరావు అన్నారు. శనివారం 'సాక్షి'తో ఆయన మాట్లాడారు. నెడ్‌క్యాప్‌ చైర్మన్‌, వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజలకు, కార్మికులకు సంక్షేమ ఫలాలు, ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. కష్టాల్లో ఉన్న వారిని ఆయన ఆదుకుంటున్నారని, ఇంటింటికీ తిరిగి సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తున్నారని చెప్పారు. నగరంలో కొంతమంది రిక్షా కార్మికుల పిల్లలకు విద్యా బోధన, వసతి ప్రభుత్వ పరంగా బాగానే కల్పిస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హులందరికీ ఏ ఇబ్బంది లేకుండా పింఛన్‌, రేషన్‌ సమయానికి అందజేస్తున్నారని కొనియాడారు.

బ్యాటరీ కారులో పర్యవేక్షణ

ఏయూ క్యాంపస్‌: పర్యావరణ హిత ఆంధ్ర విశ్వవిద్యాలయం కోసం అధికారులు మరో అడుగు వేశారు. వర్సిటీలో భవనాల పరిశీలనకు శనివారం బ్యాటరీ వాహనంలో వెళ్లారు. రిజిస్ట్రార్‌ ఆచార్య ఎం.జేమ్స్‌ స్టీఫెన్‌ వాహనాన్ని స్వయంగా నడపగా, వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి, ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్‌, డీన్‌ డాక్టర్‌ జి.వీర్రాజు వెనక కూర్చుని పర్యవేక్షించారు. వర్సిటీలో భవిష్యత్తులో బ్యాటరీ వాహనాల వినియోగం పెంచుతామని అధికారులు తెలిపారు.

'పోష్‌' కమిటీ ఏర్పాటు అవసరం



మాట్లాడుతున్న దిశా సీఐ నిర్మల


సీతంపేట: అంతర్జాతీయ ఎన్జీవో స్వచ్ఛంద సంస్థ యాక్షన్‌ఎయిడ్‌ ఆధ్వర్యంలో ద్వారకానగర్‌ పౌర గ్రంథాలయంలో వివిధ రంగాల్లో పనిచేస్తున్న మహిళలు, విద్యార్థినులు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులను ఎలా ఎదుర్కోవాలి అనే అంశంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి దిశా పోలీస్‌ స్టేషన్‌ సీఐ నిర్మల మాట్లాడుతూ కార్యాలయాలు, కళాశాలలు, వ్యాపార వాణిజ్య సంస్థలు ఇలా మహిళలు పనిచేసే ఏ ప్రదేశంలోనైనా పది నుంచి 15 మంది మహిళలు ఉంటే పోష్‌ కమిటీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఒకవేళ పురుషుల నుంచి గాని, మహిళల నుంచి గాని లైంగిక వేధింపులు ఎదుర్కొంటే పోష్‌ కమిటీ దృష్టికి తీసుకొస్తే తగు చర్యలు తీసుకుంటుందన్నారు. సంస్థ హ్యూమన్‌ రైట్స్‌ డిఫెండర్‌ దుడ్డి ఇందు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా పోష్‌ కమిటీ సభ్యులు కోరాడ స్వర్ణ, యాక్షన్‌ఎయిడ్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ ఇర్ఫాన్‌, వెండర్స్‌ కమిటీ సభ్యులు ఎర్రబిల్లి ప్రభాకర్‌, ట్రాన్స్‌జెండర్‌ ప్రతినిధి అమిత్‌ తదితరులు లైంగిక వేధింపుల చట్టంపై అవగాహన కల్పించారు.

మానవ హక్కుల పరిరక్షణకు కృషి


డి.పి.దేవ్‌, అన్నాజీరావులను సన్మానిస్తున్న రామ్మోహనరావు

సీతమ్మధార: ఆంధ్రప్రదేశ్‌ వెనుకబడిన తరగతుల(శ్రీశయన) కార్పొరేషన్‌ చైర్మన్‌గా ఇటీవల నియమితుడైన విశ్రాంత తహసీల్దార్‌, అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం శ్రీకాకుళం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.పి.దేవ్‌, అఖిల భారత కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితుడైన ఐహెచ్‌ఆర్‌ఏఐ రాష్ట్ర కార్యదర్శి సనపల అన్నాజీరావులను సంఘ రాష్ట్ర అధ్యక్షుడు పి.రామ్మోహనరావు ఆధ్వర్యంలో శనివారం మాధవధారలోని కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారిరువురు అంతర్జాతీయ మానవ హక్కుల సంఘానికి అందించిన సేవలను కొనియాడారు. నూతన హోదాలో బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి మరింత కృషి చేస్తారని, మానవ హక్కుల పరిరక్షణకు మరింతగా పాటుపడాలని రామ్మోహనరావు ఆకాంక్షించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, దళిత సేన అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.

జూలో సందడి


నీటి ఏనుగులను చూస్తున్న సందర్శకులు

ఆరిలోవ: ఇందిరా గాంధీ జూ పార్కులో దసరా సందడి నెలకొంది. పాఠశాలలు, కళాశాలలకు సెలవులు కావడంతో జూకు సందర్శకుల తాకిడి ఎక్కువగా ఉంటోంది. రెండు రోజులుగా పిల్లలను తీసుకొని ఎక్కువ మంది తల్లిదండ్రులు జూని సందర్శిస్తున్నారు. ఎక్కువగా కోతులు, ఏనుగులు, పులులు, నీటి ఏనుగుల ఎన్‌క్లోజర్లు, పక్షులు, పాముల జోన్‌ల వద్ద పిల్లలు ఎక్కువగా సందడి చేస్తున్నారు. ఇక్కడ వన్యప్రాణులను చూడడంతో పాటు మధ్యలో ఉన్న ఆట స్థలాల్లో సరదాగా ఆడుకుని రోజంతా గడుపుతున్నారు. జూ పార్కుకు రోజువారీ ఆదాయం కూడా పెరుగుతోందని అధికారులు చెబుతున్నారు.